జన సంద్రం

అక్కుపల్లి శివాసాగర్ బీచ్ వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

టెక్కలి డివిజన్‌లోని ప్రధాన బీచ్‌లు పండగ వేళ కిటకిటలాడాయి. సంక్రాంతిని పురస్కరించుకని హైదరాబాద్, విజయవాడ, పలాస నుంచి అక్కుపల్లి శివసాగర్ బీచ్‌కు, టెక్కలి నుంచి బావనపాడు బీచ్‌లకు జనం పోటెత్తారు. సముద్రం ఒడ్డును ఇసుక దిబ్బలపై కబడ్డీ, వాలీబాల్ పోటీలు, చిన్నారుల ఆటపాటలతో సందడి చేశారు. ఉదయం 10 గంటల నుంచి ఇసుక పోస్తే రాలనంతగా సాయంత్రం 6 గంటల వరకు పర్యాటకులు వస్తునే ఉన్నారు. దీంతో తీరం జనసంద్రమైంది.

పెట్టుబడులు ఊరింపేనా?

- పరిశ్రమలు, ఉద్యోగాలంటూ కూటమి నేతలు తెగ ప్రచారం
- టిడిపి హయంలో విశాఖలో రెండు పర్యాయాలు పారిశ్రామిక సమ్మిట్‌లు
- జిల్లాలో కొత్తగా ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాని వైనం
- శ్రీకాకుళంలో 'ఇన్వెస్ట్ ఇన్ శ్రీకాకుళం' పేరిట త్వరలో సదస్సు

దేశంలో ఎక్కడికి వెళ్లినా జిల్లాకు చెందిన కార్మికులే కనిపిస్తారు. 'జిల్లాకు కొత్త పరిశ్రమలను తీసుకొచ్చి జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం. జిల్లా నుంచి కార్మికులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోకుండా ఇతర ప్రాంతాలే జిల్లా వైపు చూసేలా అభివృద్ధి చేస్తాం'... ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు జిల్లాకు వచ్చిన ప్రతిసారీ ఇవే మాటలు చెప్తూనే ఉన్నారు. జిల్లాలో కొత్త పరిశ్రమల ఏర్పాటు విషయం పక్కన పెడితే, ఉన్న పరిశ్రమలు మూతపడుతున్న పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల నుంచి వలసల పరంపర కొనసాగుతూనే ఉంది. టిడిపి కూటమి ప్రభుత్వంలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు మొదలు కేంద్ర, రాష్ట్ర మంత్రుల నోట వెంట అవే పలుకులు వినిపిస్తున్నాయి. శ్రీకాకుళంలో 'ఇన్వెస్ట్ ఇన్ శ్రీకాకుళం' పేరుతో సదస్సు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో పారిశ్రామిక స్థితిగతులపై కథనం.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం ఇథనాల్, పేపర్, ఫార్మాస్యూటికల్స్ పవర్ జనరేషన్, గ్రానైట్ వంటి భారీ, మెగా పరిశ్రమలు 40 వరకు ఉన్నాయి. వీటి ద్వారా 63,070 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు ప్రభుత్వం లెక్కలు చెప్తోంది. వీటితో పాటు రైస్ మిల్లులు, జీడిపప్పు పరిశ్రమలు, పేపర్ ప్లేట్ ఉత్పత్తులు, పాలిథిన్ క్యారీ బ్యాగులు, ఇత్తడి వంటి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు 4,083 ఉన్నాయి. జిల్లాలో 2014 నుంచి 2024 మధ్య కాలంలో కొత్తగా ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాలేదు. 2014 నుంచి 2019 వరకు టిడిపి హయాంలో విశాఖలో రెండు పర్యాయాలు పారిశ్రామిక సమ్మిట్‌ల నిర్వహించారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయంటూ నాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు చెప్పారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యవసాయ అనుబంధ రంగాల పరిశ్రమలు, తయారీ రంగం యూనిట్లు వస్తాయన్నారు. జిల్లాకు ఇప్పటివరకు ఒక్కటీ రాలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం హయాంలోనూ కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాలేదు.

పాత వాటికే దిక్కులేని వైనం

రణస్థలం మండలం సంచాంలో ఏడాదికి తొమ్మిది వేల మెట్రిక్ టన్నుల మందుల ఉత్పత్తితో రూ.350 కోట్లతో బల్క్ డ్రగ్ ఉత్పత్తులను ప్రారంభించేందుకు హైయాసింథాస్ ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. పరిశ్రమలో ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 1000 మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. పరిశ్రమకు కావాల్సిన 11.41 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పగించాల్సి ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేయనున్న ప్రాంతం అనువైనదేనని అధికారులు తనిఖీ చేసి నిర్ధారించారు. ఇప్పటికీ భూమి అప్పగింతలో ఆలస్యమవుతోంది. అదే మండలంలోని చిట్టివలసలో రూ.720 కోట్లతో ఏడాదికి 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ఔషధాలు ఉత్పత్తి చేసేందుకు సంబంధిత యాజమాన్యం ముందుకొచ్చింది. పరిశ్రమలో ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 1000 మందికి ఉపాధి కల్పించేందుకు అంగీకరించింది. పరిశ్రమకు 13.91 ఎకరాల భూమి కావాల్సి ఉంది. ప్రస్తుతం భూ పరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేసే ప్రాంతం అనువైనదేనని అధికారులు నిర్ధారించారు. ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతులు రాలేదు. ఎచ్చెర్ల మండలం అల్లినగరంలో రూ.65 కోట్లతో రసాయనిక పరిశ్రమ ఏర్పాటుకు ఎన్‌ఎసిఎల్ ముందుకొచ్చింది. పరిశ్రమలో 200 మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయి.

భూములు తీసుకోవడమే పారిశ్రామిక అభివృద్ధా?

రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకోవడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టిలో పారిశ్రామిక అభివృద్ధిగా ఉన్నట్లు కనిపిస్తోంది. గతంలో టిడిపి హయంలోనే ప్రమాదకర కొవ్వాడ అణు విద్యుత్కేంద్రం పేరుతో 5070 ఎకరాలు తీసుకున్నారు. భావనపాడు పోర్టు కోసం ఐదు వేల ఎకరాలు బలవంతంగా సేకరించేందుకు ప్రయత్నించగా ప్రజలు, రైతులు తిరగబడడంతో టిడిపి హయంలో సేకరణ ఆగింది. భావనపాడు స్థానంలో మూలపేట పోర్టు నిర్మాణానికి వైసిపి ప్రభుత్వానికి అది ప్రేరణనిచ్చింది. తొలి దశలో రైతుల నుంచి 500 ఎకరాలు తీసుకున్నారు. ఇప్పుడు మూలపేట ప్రాంతంలో పది వేల ఎకరాలతో ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటు చేస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇదివరకే ప్రకటించారు. అది చాలదన్నట్లు మందస ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూములు సేకరించే పనిలో కూటమి ప్రభుత్వం ఉంది.

మూతపడ్డ పరిశ్రమలు తెరిపిస్తే అదే పదివేలు

కొత్త పరిశ్రమలు తీసుకొస్తామని చెప్తున్న కూటమి నేతలు జిల్లాలో ప్రత్యక్షంగా రెండు వేల మందికి, పరోక్షంగా పది వేల మందికి ఉపాధి కల్పించే ఆమదాలవలస చక్కెర పరిశ్రమను తెరిపించే విషయం కనీసం నోరెత్తడం లేదు. పైగా రూ.వందల కోట్ల విలువ చేసే ఫ్యాక్టరీ స్థలాలను తమ అనుయాయులకు కారుచౌకగా కట్టబెట్టేందుకు అక్కడ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రకటించారు. జిల్లాలో ముడిసరుకు లభ్యం కాక విద్యుత్ ఛార్జీలు, ఇతర పన్నులు భరించలేక అనేక చిన్నాచితకా పరిశ్రమలు మూతపడ్డాయి. వీటిలో జ్యూట్ పరిశ్రమలు ప్రధానమైనవి. జిల్లాలో జ్యూట్ పరిశ్రమల మూతపై గత వైసిపి ప్రభుత్వ హయాంలో అధ్యయనం చేసి అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అప్పటి వైసిపి ప్రభుత్వం, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటి తెరిపించే విషయం నోరెత్తడం లేదు. వీటితోపాటు కాన్‌కాస్ట్, సింథటిక్, ప్లాస్టిక్ తదితర చిన్నాచితకా పరిశ్రమలూ మూతపడ్డాయి. వీటిని తెరిపించే ప్రయత్నం చేయకుండా పెట్టుబడులు, పరిశ్రమలు అంటూ కూటమి నేతలు పాత రాగమే ఆలపిస్తున్నారు.

వి.జి.కె మూర్తి ఇక లేరు

- తుది శ్వాస విడిచే వరకు ప్రజా ఉద్యమాల్లో భాగస్వామ్యం
- సిపిఎం, ప్రజాసంఘాల్లో అనేక బాధ్యతలు నిర్వర్తించిన మూర్తి
- పలువురు సంతాపం
- నేడు సంతాప సభ
- రిమ్స్‌కు భౌతికకాయం అప్పగింత

వి.జి.కె మూర్తి భౌతికకాయానికి నివాళ్లర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు తదితరులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సిపిఎం సీనియర్ నేత వి.జి.కె మూర్తి (74) గురువారం మృతి చెందారు. ఈనెల 15వ తేదీన తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన్ను కుటుంబసభ్యులు శ్రీకాకుళం నగరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మరణించారు. ఆయన పార్టీ, ప్రజాసంఘాల్లో అనేక బాధ్యతలను నిర్వర్తించారు. 1972లో ఆయన ఎల్‌ఐసిలో ఉద్యోగిగా చేరారు. ఎల్‌ఐసి ఎంప్లాయిస్ యూనియన్ శ్రీకాకుళం బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులుగా పనిచేసి ఉద్యోగుల హక్కులు, ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాలపై పోరాడారు. 1985లో పార్టీ సభ్యునిగా చేరారు. 1992లో సిఐటియు జిల్లా ప్రథమ అధ్యక్షులుగా పనిచేశారు. 1991 నుంచి 1994 వరకు పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తించారు. జిల్లాలో సిఐటియు నిర్మాణంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఆయన ఎల్‌ఐసిలో ఉద్యోగం చేస్తూ వచ్చిన వేతనంలో చాలావరకు ప్రజా ఉద్యమాలకు ఖర్చు చేశారు. 1997లో పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో శ్యామ్‌క్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ పరిశ్రమలో సిఐటియు అనుబంధ యూనియన్ ఏర్పాటు చేయడానికి, తర్వాత ఎనిమిది నెలల పాటు కార్మికులతో సుదీర్ఘ సమ్మె నడిపించడంలో ఆయన ఎనలేని కృషి చేశారు. 1998లో అప్పటి కలెక్టర్ ఎస్.ఇ శేఖరబాబుకు కార్మికులు పడుతున్న ఇబ్బందులు, సమస్యలు వివరించి వెంటనే జోక్యం చేసుకొని సమస్య పరిష్కారానికి చేసిన కృషి కార్మికులు ఇప్పటికీ మరిచిపోలేనిది. వెంకట బాలాజీ, నీలం జూట్ కార్మికుల సుదీర్ఘ పోరాటాల్లో కీలకపాత్ర పోషించారు. ఆయన మొదటి భార్య లక్ష్మి 1991లో మృతి చెందారు. తర్వాత ప్రసూనాంబను 1993లో వివాహం చేసుకున్నారు. ఆమె 2017లో మరణించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు భారతి, స్రవంతి, కుమారుడు శ్రీనివాస్ కుమార్ ఉన్నారు.

వి.జి.కె మూర్తి (ఫైల్)

కుమార్తె భారతి, కుమారునికి ఆదర్శ వివాహం చేశారు. ఆయన మరణించే నాటికి గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షునిగా, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

పలువురు సంతాపం

వి.జి.కె మూర్తి మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.లోకనాథం, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్.కె.ఎస్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కె.మోహనరావు, నాయకులు కె.శ్రీనివాసు, కె.నాగమణి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజ శర్మ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎన్‌జిఒ అసోసియేషన్ పూర్వ ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు, యుటిఎఫ్ నాయకులు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి, పోస్టల్ యూనియన్ నాయకులు గణపతి, జ్యోతిశ్వరరావు, జెవివి రాష్ట్ర కార్యదర్శి మురళీధర్, ముస్లిం మత పెద్ద సలీం భౌతికాయాన్ని సందర్శించి నివాళ్లు అర్పించారు. ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి జామి భీమశంకరరావు, పాలిశెట్టి మల్లిబాబు, కథానిలయం కార్యదర్శి దాసరి రామచంద్రరావు, రచయితలు అట్టాడ అప్పలనాయుడు, చింతాడ తిరుమలరావు, కంచరాన భుజంగరావు, అరసం జిల్లా అధ్యక్షులు నల్లి ధర్మారావు తదితరులు నివాళ్లర్పించిన వారిలో ఉన్నారు. గరిమెళ్ల మెమోరియల్ ట్రస్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఎ.ఎన్ భుక్త, బాడాన రాజు సంతాపం తెలిపారు.

వి.జి.కె మూర్తి మరణం కార్మిక, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.ప్రభాకరరావు, కోశాధికారి పి.సుధాకరరావు అన్నారు. భౌతికకాయానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వి.జి.కె మృతిపై ప్రజాశక్తి విశాఖ, శ్రీకాకుళం ఎడిషన్ల మేనేజర్లు ఎం.వెంకటేశ్వరరావు, పి.కామినాయుడు శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రిమ్స్‌కు భౌతికకాయం అప్పగింత

తాను చనిపోయినా తన కళ్లు మరో ఇద్దరికి వెలుగునివ్వాలని ఆయన రెండు కళ్లను రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రానికి దానం చేశారు. కుటుంబసభ్యులు శ్రీనివాస్, స్రవంతి నుంచి వచ్చిన ఆహ్వానం మేరకు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుతో పాటు టెక్నీషియన్ పి.సుజాత, సహాయకురాలు అనిత చేరుకుని కార్నియాలను సేకరించారు. వాటిని విశాఖపట్నంలోని ఎల్.వి ప్రసాద్ నేత్ర వైద్యాలయానికి పంపించారు. మూర్తి కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, కోశాధికారి దుర్గా శ్రీనివాస్ అభినందించారు. మరణానంతరం తన భౌతికకాయాన్ని బోధన, పరిశోధన నిమిత్తం రిమ్స్‌కు ఇవ్వాలన్న ఆయన కోరిక మేరకు కుటుంబసభ్యులు శుక్రవారం అప్పగించనున్నారు. మరణానంతరం తన భౌతికకాయాన్ని బోధన, పరిశోధన నిమిత్తం రిమ్స్‌కు ఇవ్వాలన్న ఆయన కోరిక మేరకు కుటుంబసభ్యులు శుక్రవారం అప్పగించనున్నారు.

నేడు సంతాప సభ

ప్రజల సందర్శనార్థం ఆయన భౌతికాయాన్ని కత్తెర వీధిలోని నివాసానికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు ఆయన నివాసం వద్ద సంతాప సభ నిర్వహించనున్నారు. అనంతరం అక్కడ్నుంచి రిమ్స్ కళాశాల వరకు ప్రదర్శనగా వెళ్లి భౌతికకాయాన్ని అప్పగించనున్నారు.

పడవ బోల్తా మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

గార మండలం బందరువానిపేటలో సముద్రంలో పడవ బోల్తా పడిన ఘటనలో అదే గ్రామానికి చెందిన కుంది గడ్డెయ్య (41) గురువారం మృతి చెందాడు. చేపల వేటకు వెళ్లేందుకు సాయంత్రం బయలుదేరిన గడ్డెయ్య అలల తాకిడికి పడవ బోల్తా పడడంతో సముద్రంలో మునిగిపోయాడు. ఆయనకు భార్య తోటమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఒడ్డుకు కొట్టుకొచ్చిన మృతదేహాన్ని చూసి కుంటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మత్స్యకారుడు మృతిపై రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై మత్స్యశాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సముద్రంలో చేపల వేట సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మత్స్యకారులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీనిచ్చారు.

గడ్డెయ్య మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

గట...గటా

- పండగ వేళ తెగ తాగిన మద్యం ప్రియులు
- నాలుగు రోజుల్లో రూ.29.21 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో సంక్రాంతి పండగ వేళ మద్యం ఏరులై పారింది. పండగ రోజుల్లో అధిక మొత్తంలో మద్యం అమ్మకాలు సాగాయి. మద్యం దుకాణాలకు సంక్రాంతి, కనుమ సెలవు రోజులు కావడంతో భోగి పండగ ముందు రోజే నుంచే మద్యం దుకాణాలు కళకళలాడాయి. మద్యం విక్రయాలతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. బెల్టు షాపులు లేవని అధికారులు, ప్రభుత్వం నమ్మబలుకుతున్నా, అధికంగా అమ్మకాలు సాగడం వెనుక వాటి పాత్రే ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లావ్యాప్తంగా 158 మద్యం షాపులు, 17 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఎప్పటి మాదిరిగానే కొత్త సంవత్సరం వేడుకల పేరుతో మందుబాబులు తెగ తాగారు. గతేడాది పండగ రోజుల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. ఈ ఏడాది అందుకు భిన్నంగా అమ్మకాలు సాగాయి. భోగి ముందు రోజు నుంచే అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. భోగి రోజు గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా ఆదాయం వచ్చింది. ఆ రోజున రూ.11.20 కోట్ల అమ్మకాలు సాగాయి. 12వ తేదీన రూ.5.51 కోట్ల అమ్మకాలు సాగాయి. 11వ తేదీన రూ.6.21 కోట్ల ఆదాయం సమకూరింది. పదో తేదీన రూ.6.29 కోట్ల మేర అమ్మకాలు సాగాయి. గతేడాది కనుమ రోజు అత్యధికంగా అమ్మకాలు సాగాయి. ఆ రోజున రూ.9.22 కోట్ల ఆదాయం వచ్చింది. సంక్రాంతి రోజైన 15న రూ.8.92 కోట్ల అమ్మకాలు సాగాయి. భోగి రోజు రూ.ఆరు కోట్ల ఆదాయం వచ్చింది.

మద్యం అమ్మకాల వివరాలు ఇలా...

పండగ నేపథ్యంలో ఎప్పటి మాదిరిగానే లిక్కర్ కేసులే అధికంగా అమ్ముడైపోయాయి. ఈనెల పదో తేదీన 8,766 ఐఎంఎల్ కేసులు, 3,028 బీరు కేసులు విక్రయాలు సాగాయి. 11న తొమ్మిది వేల ఐఎంఎల్ కేసులు, 2,439 బీరు కేసులు అమ్ముడుపోయాయి. 12న 8,292 ఐఎంఎల్ కేసులు, 1649 బీరు కేసులు అమ్మకాలు సాగాయి. 13వ తేదీన 15,461 ఐఎంఎల్ కేసులు, 5 వేల బీరు కేసుల విక్రయాలు సాగాయి.

నేడు వికలాంగుల గ్రీవెన్స్

సహాయ సంచాలకులు కవిత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని వికలాంగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెల మూడో శుక్రవారం నిర్వహిస్తున్న స్వాభిమాన్ వినతుల స్వీకరణ కార్యక్రమం ఈ నెల 17 నిర్వహిస్తున్నట్లు వికలాంగుల సంక్షేమశాఖ ఎడి కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర పుండ్కర్ పాల్గొని వినతులను స్వీకరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుమార్‌రాజుకు తెలుగు కీర్తి పురస్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజుకు తెలుగు కీర్తి పురస్కారం లభించింది. శ్రీశ్రీ కళా వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కత్తి మండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతిల నుంచి ఈ మేరకు పుష్కార గ్రహీతకు లిఖిత పూర్వకంగా గురువారం సమాచారం అందజేశారు. రచనలపై ఆయకున్న ఆసక్తి, ప్రతినిత్యం ఆయన రాస్తున్న కవితలకు పలువురి నుంచి అనేక మార్లు ప్రశంసలు అందుకున్న ఆయనకు శ్రీశ్రీ కళావేదిక ఈ పురస్కారం ప్రకటించారు. ఈ నెల 21న విజయవాడలోని కౌతా పూర్ణానంద విలాస్ కళావేదికలో ఈ పురస్కారం అందజేయనున్నారు.

నేడు 'మీకోసం' రద్దు

ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదిక (మీకోసం) ఈనెల 17వ తేదీన రద్దు చేసినట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ కారణంగా నిర్వహించడం లేదని పేర్కొన్నారు. కాశీబుగ్గ పరిసర ప్రాంత ప్రజలు ఈ విషయాన్ని గమనించి ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి రావద్దని కోరారు.

రిమాండ్ ఖైదీలకు సకాలంలో న్యాయం

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

మాట్లాడుతున్న జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా వ్యాప్తంగా వివిధ జైళ్లలో ఉన్న రిమాండ్ ఖైదీలకు సత్వర న్యాయం చూకూర్చడానికి వీలుగా ఛార్జిషీట్లు దాఖలు చేసి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమావేశ మందిరంలో గురువారం పోలీసు, జైలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జిపి, స్టాట్యూటరీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీర్ఘ కాలంగా జైళ్లలో ఉంటున్న వారికి న్యాయ సహాయం అందించేందుకు వీలుగా న్యాయసేవాధికార సంస్థ తోడ్పాటు 2023-24 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయాలు ఖర్చులు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.వి.ఎల్.హిమబిందు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాలకు దరఖాస్తుల స్వీకరణ

డిఎంహెచ్‌ఒ బాలమురళి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (ఎన్‌ఆర్‌హెచ్‌ఎం) ప్రోగ్రాంలో పనిచేసేందుకు వివిధ కేటగిరిల్లో ఏడాది కాలం పాటు తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు వివిధ పోస్టుల్లో నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని డిఎంహెచ్‌ఒ డాక్టర టి.బాలమురళి ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ ఫిజిషియన్, మెడికల్ ఆఫీసరు ఒకటి, మెడికల్ ఆఫీసర్ కాంట్రాక్టు రెండు, క్లినికల్ సైకాలజిస్టు ఒకటి, ఆప్తామెట్రిస్టు ఒకటి, డెంటల్ టెక్నీషియన్ ఒకటి పోస్టు నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్టు తెలిపారు. ఈ ఉద్యోగాల నియామకానికి ఈ నెల 17 నుంచి 22 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కేటగిరి వారీగా పోస్టుల్లో నియామకానికి అవసరమైన పూర్తి వివరాలను www.srikakulam.ap.gov. in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. అలాగే వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 కాంట్రాక్టు ఒకటి, అవుట్ సోర్సింగ్ ద్వారా ఐదు, ఎఫ్‌ఎన్‌ఒ ఐదు పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సకాలంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

సజావుగా కానిస్టేబుల్ దేహ దారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

స్థానిక ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు మైదానంలో నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ సజావుగా సాగుతోంది. గురువారం నిర్వహించిన దేహ దారుఢ్య పరీక్షలకు 727 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, ఇందులో 478 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. వారిలో 317 మంది పురుష అభ్యర్థులు అర్హత సాధించారు. అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన అనంతరం ఎత్తు, ఛాతి కొలత, 1600 మీటర్ల పరుగు, వంద మీటర్ల పరుగు, లాంగ్ జంప్ ఈవెంట్లను నిర్వహించారు.

పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

రహదారి భద్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రోడ్డు ప్రమాదాలకు నిర్లక్ష్యం అనేక సందర్భాల్లో కారణమవుతుందని, అందువల్ల రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్ఐ దేవదానం అన్నారు. నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న గ్యారేజీలో రహదారి భద్రతా వారోత్సవాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా రోడ్లపై వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏకాగ్రత, ఇతర వాహనాలు నడిపే వారి స్థితిని గుర్తించి వాహనాలను నడపడం కీలకమన్నారు. ప్రయాణికులకు భరోసా కలించేలా వాహనాలను నడపాలన్నారు. రెండో డిపో మేనేజర్ శర్మ మాట్లాడుతూ ప్రమాదరహిత సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే ఆర్‌టిసి లక్ష్యమన్నారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడంలో డ్రైవర్లదే కీలక పాత్ర అన్నారు. ఆర్‌టిసిపై ప్రయాణికులకు ఎంతో నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం-1,2 సహాయ మేనేజర్లు రమేష్, గంగరాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఎస్.నాయుడు, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లు భాస్కరరావు, మూర్తి, భద్రత, నిఘా విభాగం సిబ్బంది, డ్రైవర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ దేవదానం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

అభివృద్ధిలో యువత పాత్ర కీలకం
వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి
రాష్ట్ర పురోభివృద్ధికి యువత పాత్ర కీలకమని, సంపద సృష్టించడంలో యువకుల కృషి అవసరమని, భావి తరాలకు యువత మార్గదర్శకులుగా నిలబడాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడ మంత్రి క్యాంపు కార్యాలయంలో అఖిలభారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతం చేయడంలో యువకులకు రాజకీయాలు అవసరమని అన్నారు. యువత రాజకీయాల్లోకి రావడం ద్వారా రాష్ట్ర పురోభివృద్ధి సాధ్యమని అన్నారు. ఆహ్వాన సంఘ అధ్యక్షులు చాపర సుందర లాల్ మాట్లాడుతూ శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6 నుంచి 9 వరకు నిర్వహించనున్న ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, ఆహ్వాన సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్కంఠగా సాగుతున్న వాలీబాల్ పోటీలు

వాకలవలసలో ఉత్కంఠగా క్రీడలు
ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
సంక్రాంతి వేళ వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామానికి చేరుకున్న యువత ఉత్సాహంగా క్రీడల పోటీల్లో పాల్గొని సందడి చేశారు. శ్రీకాకుళం మండలం వాకలవలసలో గురువారం వివిధ పోటీలను నిర్వహించారు. పాటలు, వాలీబాల్, మ్యూజికల్ చైర్, డ్యాన్స్, ముగ్గులు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత బగాది కిరణ్, ఎదురువలస గురుమూర్తి, పేడాడ రాజేష్, బగాది గౌతు, కూన రాజేష్, పేడాడ తారకేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి వినతి
ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వినతిపత్రం అందజేస్తున్న సూర్యప్రకాశరావు

ఇచ్ఛాపురం, బారువ, జాడిపూడి రైల్వే స్టేషన్ల పలు రైళ్లను నిలుపుదల చేయాలని డిఆర్‌యుసిసి సభ్యులు కె. సూర్య ప్రకాశరావు కోరారు. ఈ మేరకు కుర్దా రైల్వే డిఆర్ఎం ఈచ్. ఎస్. బజ్వాను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా కాలిబాట వంతెన నిర్మాణం పడమట వైపు పొడిగించాలని కోరారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఎంతమందికి ప్రయోజనం ఉంటుందో? లేదో? పరిశీలించి చర్యలు తీసుకుంటామని డిఆర్ఎం తెలిపారు. బాహుదా నది వైపు కాలనీకి వెళ్లేందుకు అండర్ పాస్ నిర్మించాలని కోరారు. డిఆర్ఎం స్పందించి రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మించేందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి నివేదికను పంపించామన్నారు. విశాఖ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి వరకు పొడిగింపు, బారువ, జాడిపూడి రైల్వే స్టేషన్లలో విశాఖ, పాసింజర్ రైళ్ల నిలుపుదల చేయాలని సూర్యప్రకాశరావు తెలిపారు. కార్యక్రమంలో జాడిపూడి రైల్వే యూసర్స్ కమిటీ సభ్యులు గుడియా బాలకృష్ణ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళం
కోటబొమ్మాళి: స్థానిక ఎన్‌టిఆర్ భవన్ అవరణలో పేదలకు రూ.5లకే రుచికరమైన భోజనం అందిస్తున్న అన్న క్యాంటీన్‌కు మండలంలోని కురుడు పంచాయతీ చౌదరికొత్తూరుకు చెందిన టిడిపి నాయకులు నాళ్ల ఆదినారాయణ (చిన్ని) గురువారం రూ.25 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. తన సోదరుడు నాళ్ల లక్ష్మీనారాయణ ప్రథమ వర్ధంతి సందర్భంగా అందజేస్తున్నానని, ఈ మొత్తాన్ని అన్న క్యాంటీన్ నిర్వాహకులు లాడి శ్రీనివాస్‌కు అందజేశానని తెలిపారు.

సకాలంలో రేషన్ ఇప్పించాలి
వజ్రపుకొత్తూరు: పాతటెక్కలి రేషన్ దుకాణం ద్వారా రేషన్ సరుకులు సక్రమంగా అందడం లేదని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుల నుంచి ఫింగర్ ప్రింట్లు తీసుకొని సరుకులు ఇవ్వడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఫింగర్ ప్రింట్లు తీసుకున్న వెంటనే రేషన్ సరుకులు వినియోగదారులకు అందించాల్సి ఉంది. అయితే ఫింగర్ ప్రింట్లు తీసుకున్న నాలుగు రోజులు సరుకులు అందివ్వకుండా జాప్యం చేస్తూ.. ఆ తరువాత స్టాక్ లేదని చెబుతున్నారని వినియోగదారులు చెబుతున్నారు. పాతటెక్కలి రేషన్ డీలరు అవినీతిపై పార్టీలకతీతంగా స్థానికలు గ్రామంలోని కూటమి నాయకులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ విషయమై డిటి కె.మురళీకృష్ణను వివరణ కోరగా, పాతటెక్కలి రేషన్ డీలరుపై ఆరోపణలు తన దృష్టికి వచ్చిందన్నారు. వినియోగదారులతో మాట్లాడి ఆరోపణలు నిజమైతే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జాతీయ కాపు సంఘం ఇన్‌ఛార్జిగా 'లంక'
ఆమదాలవలస: జాతీయ కాపు సంఘం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా లంక నాగరాజును నియమిస్తూ జాతీయ కాపు సంఘం వ్యవస్థాపకులు, అధ్యక్షులు కర్ణ మురళీ కృష్ణ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేస్తూ కాపుల సంక్షేమానికి వారి అభివృద్ధికి చిత్త శుద్ధితో కృషి చేస్తానని తెలిపారు.

భవన నిర్మాణాలకు వినతి
కవిటి: అసంపూర్తిగా నిలిచిపోయిన కళింగ సంక్షేమ భవన నిర్మాణాలకు నిధులు కేటాయించాలని శ్రీకృష్ణ భార్గవ కళింగ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ అశోక్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన విప్ అవకాశం ఉన్నంతవరకు నిధులు మంజూరుకు సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకష్ణ భార్గవ కళింగ సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

మండీల వద్దే ధాన్యం కొనుగోలు చేయాలి
పర్లాకిమిడి: మండీలవద్దే ధాన్యం కొనుగోలు చేయాలని గజపతి జిల్లా రైతు కూలీ, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రొక్కం లోకనాథం డిమాండ్ చేశారు. గజపతి జిల్లా కాశీనగర్ ఆర్ఎంసి కార్యాలయం వద్ద గురువారం యర్నాగుల ధనుంజయ రైతు వేబ్రిడ్జ్ వద్ద తూచి అదేచోట ధాన్యాన్ని వేసి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొసైటీ సెక్రటరీలు వివిధ మిల్లులకు పంపించే ప్రయత్నం చేస్తున్నారని, టోకెన్ల ప్రకారం ఉన్న తేదీల్లో వద్దనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

బుట్టలెన్ని అల్లినా బువ్వ లేదు

కులవృత్తిని విడవలేక బ్రతుకు బండిని నడపలేక మేదర వృత్తిని నమ్ముకున్న మేదరులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వృత్తి దారులకు ప్రభుత్వం అండగా నిలబడుతుందని ఆశతో ఉన్నవారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందకపోవడంతో ఏం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

బుట్టలను అల్లుతున్న కార్మికులు

- ప్లాస్టిక్ వినియోగంతో తగ్గిన గిరాకీ
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- ఆందోళనలో మేదరులు

ప్రజాశక్తి-బూర్జ
మండల కేంద్రం బూర్జలో 15 కుటుంబాల మేదర కులస్తులు వంశపార పర్యంగా వస్తున్న కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. అయితే కులవృత్తిని నమ్ముకున్న తమకు అవస్థలు తప్పడం లేదని వృత్తి దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురాతనంగా మేదరులు అల్లిన వెదురు తడకలు, బుట్టలు, గృహోపకరణాలు ప్రతి ఇంట్లోనూ

అమ్మకానికి సిద్ధం చేసిన బుట్టలు

వినియోగించడం వల్ల అప్పట్లో తమ బతుకులు మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఉండేవని ప్రస్తుతం బతుకు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దెబ్బతీస్తున్న ఆధునిక వస్తువులు...

మార్కెట్‌లోకి రకరకాల వస్తువులు రావడంతో ఆనవాయితీగా వస్తున్న వెదురు తడకలు, బుట్టలు వంటివి వినియోగంలోకి తీసుకోవడం లేదని, దీంతో తమ వృత్తిపై తీవ్ర ప్రభావం చూపుతోందని వృత్తిదారులు వాపోతున్నారు.

పస్తులు తప్పడం లేదు...

ఇంటిల్లిపాది కష్టపడి తయారు చేసిన బుట్టలు, తడకలు వంటి గృహోపయోగకర వస్తువులను తయారు చేసినప్పటికీ గిరాకీ లేకపోవడంతో ఒక్కొక్కసారి పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురిస్తుందని, వెదురు కర్రలకు డిమాండ్ ఉండడంతో ఎక్కువ డబ్బులకు కొనుగోలు చేసినప్పటికీ తాము తయారు చేసిన వస్తువులకు అమ్ముడుపోక నష్టాలను కూడా చూడాల్సిన పరిస్థితి ఎదురవుతుందని మేదరులు ఆవేదన చెందుతున్నారు.

ఆదుకోని ప్రభుత్వం...

ఇంతవరకు కులవృత్తిపై ఆధారపడ్డ తమకు ఇంతవరకు ప్రభుత్వం ఎటువంటి సాయం అందజేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కులవృత్తిపై ఆధారపడ్డ కుటుంబాలకు ప్రభుత్వం ఏదైనా సహాయం అందించాలని కోరుతున్నారు.

కష్టమే మిగులుతుంది

కష్టపడి పని చేసినప్పటికీ పస్తులు తప్పడం లేదు. మార్కెట్‌లో గిరాకీ లేకపోవడం వల్ల తయారు చేసిన వస్తువులు అమ్ముడు పోవడం లేదు. వలసలు పోలేక కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం.
- కొయ్యాన సింహాచలం, బూర్జ

ప్రభుత్వం ఆదుకోవాలి

కులవత్తిని నమ్ముకొని కటిక పేద రికంలో జీవనం సాగిస్తున్నాం. పూర్వీకుల కాలం నాటి కులవృత్తిని వదులు కోలేక ఇతర ప్రాంతాలకు వలసలు పోలేక జీవనం సాగిస్తున్నాం. తమను ప్రభుత్వం ఆదుకోవాలి.
- నర్స అప్పన్న, బూర్జ

విధుల్లో చేరిన ఎంపిడిఒ

హరిహరరావు

ఎచ్చెర్ల: ఇటీవల మండలస్థాయి నేత బెదిరింపులకు తీవ్ర అస్వస్థతకు గురైన ఎంపిడిఒ సీపాన హరిహరరావు గత నెల 28న జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.శ్రీధర్ రాజుకి తెలియజేయడంతో శ్రీధర్ రాజు ఫిర్యాదు మేరకు ఆ మండల స్థాయి నేతపై పోలీసు కేసు నమోదు చేశారు. అస్వస్థకు గురైన ఎంపిడిఒ హరిహరరావు సెలవు కోరగా సెలవు మంజూరు చేశారు. 18 రోజుల తరువాత నేడు తిరిగి మరలా బాధ్యతలు స్వీకరించారు.

సరుకులను పంపిణీ చేస్తున్న రాజు

సరుకుల పంపిణీ
కొత్తూరు: మండలంలోని ఓండ్రుజోల, గులివిందలపేట గ్రామాల్లో ఉన్న పేతలకు ఓండ్రుజోలకు చెందిన సామాజిక వేత్త బి.రాజు గురువారం నిత్యవసర సరుకులైన బియ్యం, అయిల్, కంది పప్పు, పంచదార అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆరుబోలు దశరథ, మురళి పాల్గొన్నారు.

ఉద్దానం యువ కవి ప్రతిభ
పలాస : మండలంలోని మాకన్నపల్లికి చెందిన యువ కవి కుత్తుం వినోద్ తన కవితల ద్వారా ప్రజలు మన్ననలు పొందారు. అమెరికాలోని అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) ఆధ్వర్యాన ప్రచురితమవుతున్న 'అమెరికా భారతి' జనవరి సంచికలో 'ఒక తుపాను రాత్రి' అనే శీర్షికతో తన కవిత ప్రచురితమైందని వినోద్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కవులు, రచయితలు అభినందనలు తెలియజేశారు.

ఆట స్థలానికి విరాళం
పలాస: మండలంలోని మాకన్నపల్లికి చెందిన కుత్తుం ప్రసాదరావు ఆట స్థలానికి రూ.75 వేలు విరాళం అందజేశారు. గ్రామంలో క్రీడా మైదానం లేకపోవడంతో క్రీడాకారులు, యువత తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో కుత్తుం ప్రసాదరావు నడుంబిగించారు. గ్రామంలో క్రీడా మైదానానికి స్థలం సేకరించి తన వంతుగా రూ.75 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సైని దేసయ్య, కుత్తుం ధర్మారావు, బత్తిన వీరాస్వామి, చిన్నారావు, సైని నాగేశ్వరరావు, దాసరి దానేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పిహెచ్‌సి ఏర్పాటు చేయాలి
మెళియాపుట్టి: మండలంలో పెద్దమడిలో పిహెచ్‌సిని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అత్యవసర వైద్యానికి రెండు బస్సులు మారి కరజాడ పిహెచ్‌సికి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన ప్రాంతం కావడం, అలాగే ఇక్కడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, ఎపి రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, కళాశాలలో దాదాపు వెయ్యి మంది వరకు విద్యార్థులు చదువు సాగిస్తున్నారు. అనారోగ్యానికి గురైన వారు పిహెచ్‌సి అందుబాటు లేక ప్రయివేటు వైద్యానికి 20 కిలోమీటర్ల దూరంలోని పలాస ఆశ్రయించాల్సి వస్తోందని అంటున్నారు. పెద్దమడిలో పిహెచ్‌సి ఏర్పాటైతే టి.కె.ఆర్.పురం, హీరాపురం, పరశురాంపురం, నందవ, తోవూరు, కొత్తూరు, చీపురుపల్లి, పెద్దమడి గ్రామాలతో పాటు సరిహద్దు నందిగాం మండలంలోని దాదాపు పది గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందుతాయి. పాలకులు, అధికారులు దృష్టి సారించి పిహెచ్‌సి ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతపు ప్రజలు కోరుతున్నారు.

ప్రయివేటు బస్సులతో అవస్థలు
ప్రజాశక్తి- టెక్కలి
టెక్కలి పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో ప్రయివేట్ బస్సులు నిలుపుదల చేసి ఆక్రమణలకు పాల్పడడంపై ఆ ప్రాంతీయులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా ఉన్న స్థలం రద్దీగా ఉంటుంది. ఈ ప్రాంతంలోనే ఎస్‌బిఐ, మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే దారి. చిల్లర వ్యాపారస్తులు విరివిగా ఉండే ప్రదేశం. ఇటువంటి ప్రదేశంలో నెలల తరబడి బస్సులు నిలుపుదల చేయడంతో చాలా వరకు స్థలం ఆక్రమణకు గురవుతుంది. దీంతో ప్రజలు, వాహనదారులు పలు అవస్థలకు గురవుతున్నారు. ఇక్కడ వాహనాలు నిరంతరం నిలిపి వేయడంతో ఎదురుగా ఉన్న వ్యాపార దుకాణాదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంత వ్యాపారస్తులు బస్సులు నిలుపుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ... పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా సమస్యకు పరిష్కారం లభించలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి అనాధికారంగా నిలిపివేసిన బస్సులను తొలగించాలని కోరుతున్నారు.

నిలుపుదల చేసిన బస్సులు

ముగిసిన సంగమేశ్వర స్వామి జాతర
ప్రజాశక్తి- ఆమదాలవలస
మండలంలోని గాజుల కొల్లివలస దగ్గర ఉన్న సంగమేశ్వర స్వామి జాతర ఆఖరి రోజు ముక్కనుమతో ముగిసింది. గురువారం జాతర ఆఖరిరోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడి, విజయనగరం, విశాఖపట్టణం నుంచి జాతరకు భారీఎత్తున యాత్రికులు తరలివచ్చారు. చిన్నాపెద్దా తేడా లేకుండా జాతరలో కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపారు. జాతరకు యాత్రికులు పోటెట్టడంతో అలికాం-బత్తిలి ప్రధాన రహదారి నుంచి సంగమేశ్వర స్వామి కొండ దిగువన జరిగే జాతర వద్దకు చేరుకునేందుకు యాత్రికులకు చాలా సమయం పట్టింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కొంత మంది ఆకతాయిలు ద్విచక్ర వాహనాలతో జాతర వద్దకు వివిధ మార్గాల్లో రావడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. చీకటి పడినప్పటికీ జాతరకు యాత్రికుల రాక తగ్గలేదు. చివరి రోజు కావడంతో భక్తులు కొండపై నున్న సంఘమేశ్వర స్వామిని దర్శించుకునేందుకు యాత్రికులు క్యూ లైన్‌లలో బారులు తీరారు. జాతర ప్రశాంతంగా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

జాతరకు వస్తున్న యాత్రికులు

లావేరు : గురమ్మ పేరంటాలను దర్శించుకుంటున్న ఎంపీ, ఎమ్మెల్యే

గురమ్మ పేరంటాలు సందర్శన
ప్రజాశక్తి- లావేరు
మండలంలోని గుర్రాలపాళెంలో గురమ్మ పేరంటాలు 55వ వార్షికోత్సవం సందర్భంగా జరుగుతున్న యాత్ర మూడవరోజు సందర్భంగా గురువారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురమ్మ పేరంటాలను దర్శించి పూజలు చేశారు. వారి వెంట టిడిపి మండల అధ్యక్షులు ముప్పుడి సురేష్, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

రణస్థలం రూరల్: మండలంలోని కోటపాలెంలో ఉన్న శ్రీ భద్ర మహంకాళి అమ్మవారి జాతర పురస్కరించుకొని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, లంక శ్యాం, సుంకర ధనుంజయరావు, పిన్నింటి వెంకట భానోజీ నాయుడు, బసవ గోవిందరెడ్డి, దుమ్ము అశోక్, ముప్పిడి సురేష్, మీసాల మౌళి, మైలపల్లి పోలీసు, కోటపాలెం సర్పంచ్ గొర్లె జగదీష్ పాల్గొన్నారు.

దుస్తులను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మహర్షికి నివాళి
ప్రజాశక్తి- టెక్కలి
సంప్రదాయ, ఆచారాలు పాటించాలని విశ్రాంత ఇంజినీరింగ్ అధికారి పమ్మిన సింహాచలం అన్నారు. పట్టుశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన స్థానిక అక్కపువీధిలో భావనామహర్షి జయంతిని గురువారం నిర్వహించారు. ముందుగా మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఆ సంఘ అధ్యక్షులు మల్లిపెద్ది మధుసూదనరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం పమ్మిన సింహచలం, లోకేశంల సౌజన్యంతో 20 మందికి దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షులు దుంప లోకేశం, కార్యదర్శి దుంపా శ్రీనివాస్, సంఘ నిర్వాహకులు ఆట్ల పార్వతీశం, బస్వాశ్యాం సుందరరావు, దుంప మురళీమోహనరావు, వడగ అశోక్, బుడ్డ నందికేశ్వరరావు, ఆట్ల విశ్వేశ్వరరావు, కాపల రఘునాథరావు, దుంప సాంబమూర్తి పాల్గొన్నారు.

తవ్వి వదిలేసిన రహదారి

గుంతలు పూడ్చేదెన్నడో..?
ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

ప్రజాశక్తి- ఆమదాలవలస
సిఎస్‌పి రహదారి గుంతలు పూడ్చేదెన్నడోనని వాహనదారులు, ప్రజలు రోడ్లు భవనాల శాఖ అధికారులను ప్రశ్నిస్తున్నారు. పట్టణ శివారున ఉన్న ప్లై ఓవర్ బ్రిడ్జి దిగువన ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద నుంచి శ్రీకాకుళం - పాలకొండ రోడ్డులోని మండాది వరకు సుమారు మూడు కిలోమీటర్లు ప్రధాన రహదారిని వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం కుమారుడి వివాహానికి అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వస్తున్నారన్న కారణంతో సుమారు రూ.కోటిపైగా నిధులతో ఈ రహదారిని నిర్మించారు. వర్షం పడుతుండగానే రహదారిని నిర్మిస్తున్నారని అప్పట్లో ఈ రహదారిపై పలు కథనాలు పత్రికల్లో వచ్చాయి. రహదారి నిర్మాణం పూర్తయిన నుంచి ప్రతిఏటా రహదారి పాడవుతుండడంతో గుత్తేదారు రహదారిని తవ్వడం, మళ్లీ తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం జరుగుతూనే ఉంది. సంక్రాంతికి ముందు రహదారి పాడవ్వడంతో అక్కడక్కడ గుంతలు తవ్వి మరమ్మతులు చేపట్టకుండా విడిచిపెట్టడంతో వాహనదారులు, ప్రజలు గుంతలను తప్పించబోయి ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారి మరమ్మతులు చేపట్టాల్సిన గుత్తేదారు, ఆర్అండ్‌బి అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రహదారి నిర్మించిన నాటినుంచి ఇప్పటివరకు ఏడాదికి రెండుసార్లు రహదారిపై ఏర్పడిన గుంతలను తవ్వుతూ వారికి ఇష్టం వచ్చిన సమయంలో మరమ్మతులు చేపడుతున్నారని, దీంతో పలు ఇబ్బందులకు గురవుతున్నామని వాహనదారులు, ప్రజలు, అధికారులు గుత్తేదారు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు రహదారిపై గుంతలను కప్పి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

ప్రయాణం సాగేదెలా..?

కూటమి ప్రభుత్వం రహదారులకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నప్పటికీ అధికారులు, గుత్తేదారులు పట్టించుకోవడం లేదు. ప్రధాన రహదారిని ఇలా తవ్వి విడిచిపెడితే ప్రయాణం సాగించేదెలా. రహదారిపై తవ్వివిడిచి పెట్టడంతో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలి.
- ఎండ షణ్ముకాంజనేయులు, లక్ష్ముడుపేట

అధికారుల పర్యవేక్షణ ఉండాలి

సిఎం చంద్రబాబు నాయుడు సంక్రాంతి పండుగకు ముందే రహదారుల మరమ్మతులను పూర్తి చేయాలని చెప్పినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. రహదారుల నిర్మాణం చేపట్టేటప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలి. లేకుంటే ప్రజాధనం ఇలా వృధా అవుతుంది. అధికారులు రహదారి మరమ్మత్తులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలి.
- చేపేన సురేష్, చేపేన పేట

విశాఖలో సోంపేట వాసి మృతి
ప్రజాశక్తి- సోంపేట

రాజ్‌కుమార్ మృతదేహం

మండలంలోని భూసా భద్రకు చెందిన మందపాటి రాజ్‌కుమార్ (50) విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో మృతి చెందారు. రాజ్‌కుమార్ భార్య రాజ్యలక్ష్మి, ఇద్దరు పిల్లలు విశాఖపట్నంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వికలాంగుడైన రాజకుమార్ భూసాభద్రలో ఒంటరిగా నివసించేవాడు. గురువారం ఉదయం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపై రాజ్‌కుమార్ మృతదేహాన్ని గమనించిన రైల్వే పోలీసులు అతను వద్ద ఉన్న బస్సు పాస్, ఆధార్ కార్డులను చూసి సోంపేట పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. మృతిపై వివరాలు తెలియాల్సి ఉందని ఇక్కడి పోలీసులు తెలిపారు.

గాయపడిన వృద్ధుడు మృతి
కొత్తూరు: స్థానిక రాజా వీధి చెందిన శిల్లా చక్రవర్తి (69) గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం పారాపురం పెట్రోల్ బంకు వద్ద ద్విచక్రవాహన్ని మరో ద్విచక్ర వాహనం బలంగా ఢీకొనడంతో చక్రవర్తి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి 108లో తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుని కుమారుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి
ప్రజాశక్తి- పాతపట్నం
మండలం లోగిడి గ్రామ రైల్వే గేట్ సమీపంలో గురువారం సాయంత్రం రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ కె.షరీఫ్ వివరాల మేరకు స్థానిక లోగిడి గ్రామ రైల్వేగేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైల్వే ట్రాక్ దాటుతున్న సమయంలో పూరి నుంచి గుణుపూర్ వెళ్తున్న పూరి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని వ్యక్తి మరణించాడని, కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నామని రైల్వే ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

ఐదోసారి 'జాతీయ పురస్కారం'
ప్రజాశక్తి- రణస్థలం

అమ్మోజీ

మండలం కోష్ట పంచాయతీ సచివాలయ మహిళా పోలీసుగా విధులు నిర్వర్తిస్తున్న బమ్మిడి అమ్మోజీ ఐదోసారి జాతీయ పురస్కారం అందుకోనున్నారు. సమీక్షకురాలిగా, సామాజికవేత్తగా రాణిస్తున్న యువ రచయిత్రి అమ్మోజీ బమ్మిడి తెలుగు తేజం పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్, వరల్డ్ రైటర్స్ ఫోరం, గోదావరి కల్చరల్ అసోసియేషన్ సంయుక్తంగా అందిస్తున్న ఈ పురస్కారానికి ఎంపికైనట్లుగా ఆహ్వానపత్రాన్ని సంస్థల అధ్యక్షులు సి.కె.వి.రావు, కె.రాఘవేంద్రరావు అమ్మోజీకి అందజేశారు. అంతర్జాతీయ సాహిత్య సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదికలో కీలకమైన మీడియా ప్రతినిధి బాధ్యత నిర్వర్తిస్తూ తాను చేస్తున్న సాహిత్య కార్యక్రమాలకు, సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డును ఎంపిక చేశామని వారు తెలిపారు. ఈ అవార్డును జనవరి 21న విజయవాడలో ప్రముఖుల చేతులమీదుగా అందుకోనున్నట్లు అమ్మోజీ తెలిపారు. అమ్ముకలం పేరుతో రచనలు చేస్తున్న ఆమె గతంలో తెలుగు తేజం, సేవా రత్న, శ్రీశ్రీ ప్రతిభ పురస్కారం, విశ్వభారత్ వీర పురస్కారం, తదితర అవార్డులను సొంతం చేసుకోవడంతో పాటు మూడు వరల్డ్ రికార్డుల్లో స్థానం సంపాదించుకున్నారు. టెక్కలి మండలం పోలవరానికి చెందిన అమ్మోజీ ఒక అనాథ శరణాలయంలోని ముగ్గురు బాలికలను దత్తత తీసుకొని ఏడేళ్లుగా వారి యోగక్షేమాలు చూస్తున్నారు. ఎప్పటిలాగే ఈ పురస్కారం పారితోషికాన్ని ట్రస్ట్ పిల్లలకి అప్పగిస్తానని అమ్మోజీ తెలిపారు. ఇంతటి విశిష్ట పురస్కారానికి ఎంపిక చేసినందుకు సంస్థల ప్రతినిధులకు, శ్రీశ్రీ కళావేదికలో సముచిత స్థానం కల్పించిన చైర్మన్ కత్తిమండ ప్రతాప్‌కు, కన్వీనర్ కొల్లి రమావతికి అమ్మోజీ ధన్యవాదాలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల అత్మీయ కలయిక

పూర్వ విద్యార్థుల సమ్మేళనం
పొందూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993-1994 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం స్థానిక పిజె కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకొని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను ఘనంగా సత్కరించారు. అలాగే మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 30 సంవత్సరాల తర్వాత అందరూ కలుసుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. గురువులకు పాదాభివందనాలు చేస్తూ ఘనంగా సన్మానించారు. అలాగే పాఠశాల అభివృద్ధికి రూ.50 వేలు ఆర్థికసాయాన్ని ఇన్‌ఛార్జి హెచ్ఎం గోపాలశెట్టి సాయికుమార్‌కు అందజేశారు. భవిష్యత్‌లో పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పూర్వ విద్యార్థులు బాలకృష్ణ, కిషోర్‌బాబు, సన్యాసిరావు తదితరులు తెలిపారు.

సెలవు రోజుల్లో అభిప్రాయ సేకరణ తగదు
ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
పాఠశాల విద్యాశాఖ జిఒ 117 రద్దు తరువాత చేపట్టాల్సిన సవరణల మెమోపై క్లస్టర్, మండల, జిల్లాస్థాయిలో తల్లిదండ్రులు, ఉపాధ్యా యులతో అభిప్రాయ సేకరణ సమావేశాలు సంక్రాంతి సెలవుల్లో నిర్వహించడం తగదని, తక్షణమే ఈ సమావేశాలను వాయిదా వేయాలని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 9న మెమో విడుదల చేసి సంక్రాంతి సెలవు లోపలే అభిప్రాయ సేకరణ చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలివ్వడం సరికాదన్నారు. ఈనెల 20 తరువాత నిర్వహించాలని డిమాండ్ చేశారు.